ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా.25, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 23, పందిరి బీర 28, క్యాబేజీ 13, క్యారెట్ 28, దొండ 13, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 65, గోకరకాయ 23, కీర 28, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 38, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కంటోన్మెంట్ గులాబీ బాస్ ఎవరు?

- మంత్రి తలసాని ఇన్‌చార్జ్‌గా నియామకం
- తాజాగా గజ్జెలకు అదనపు బాధ్యతలు
- ఎన్నికల వేళ లాస్యకు తలనొప్పిగా మారిన వ్యవహారం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్‌ఎస్‌లో ఆధిపత్య పోరు పార్టీ అభ్యర్థికి తలనొప్పిగా మారింది. గ్రూపుల వారీగా విడిపోయిన కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంలో రోజుకో ఇబ్బంది ఎదురవుతోంది. బోర్డు మాజీ సభ్యులు, సాయన్న వర్గాలకు తోడు కార్పొరేషన్ చైర్మన్‌ల వర్గాలను ఏకతాటిపైకి నడిపించడంలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొత్తానికి అన్ని వార్డుల పరిధిలో తొలిదశ పాదయాత్ర పూర్తి చేసి పరిస్థితి కొలిక్కి వచ్చిందనుకున్న క్షణంలో ఇంచార్జ్ నియామకం మరో వివాదానికి తెరలేపింది. పార్టీ అధిష్టానం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్‌గా ప్రకటించింది. తాజాగా అదనపు ఇంచార్జ్‌గా బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్‌ను నియమించడం లాస్య వర్గానికి మింగుడుపటం లేదు. అంతా సవ్యంగా సాగుతున్న వేళ మరోసారి వర్గపోరు తీవ్రమవుతుందని ఆందోళన చెందుతున్నారు. గజ్జెల నాగేశ్ బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ తానే ఇంచార్జ్‌నని చెప్పుకొచ్చారు. అయితే లాస్య నందిత వర్గానికి చెందిన నేతలెవరూ గజ్జెల వెంట లేకపోవడం గమనార్హం.

సాయన్న మరణంతో మొదలైన పోరు

దివంగత ఎమ్మెల్యే సాయన్న మరణంతో నియోజకవర్గంలో పార్టీకి పెద్ద దిక్కు కరువైంది. సాయన్న వారసులుగా లాస్య, నివేదిత తమ ఉనికి కోసం తీవ్రంగానే పోరాటం చేయాల్సి వచ్చింది.ఈ క్రమంలో అధిష్టానం పార్లమెంట్ ఇంచార్జ్‌గా కొనసాగుతున్న మర్రికి కంటోన్మెంట్ బాధ్యతలు అప్పగించారు. దీంతో నియోజకవర్గ కార్యకర్తలు అంతా ఒక్కసారిగా మర్రి వైపునకు మళ్లారు. తాజాగా బీఆర్‌ఎస్ అభ్యర్థిగా లాస్యను ప్రకటించడంతో మళ్లీ ఆమె వైపునకు వెళ్లారు. ఎన్నికల ఇంచార్జ్‌గా మంత్రి తలసానికి బాధ్యతలు అప్పగించడంలో ఆయన అజమాయిషీలో ప్రచారం కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో గజ్జెల ఎంట్రీ అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఇదే విషయాన్ని లాస్య నందిత మంత్రి తలసాని దృష్టికి తీసుకెళ్లడంతో గురువారం మరోసారి సమన్వయ సమావేశం ఏర్పాటుకు పిలుపునిచ్చారు. సాయన్న నివాసంలో జరిగే ఈ సమావేశంలో అయినా గ్రూపు తగాదాలు కొలిక్కి వస్తాయో రావో వేచి చూడాల్సిందే.

బీజేపీకి అధికారంతోనే బీసీలకు న్యాయం



బేగంపేటలో జరిగిన పాదయాత్రలో పాల్గొన్న మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

సనత్‌నగర్: బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు బీజేపీ ఆయా వర్గాలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందని మాజీ మంత్రి, ఆ పార్టీ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా ప్రకటించడమే ఇందుకు నిదర్శనమన్నారు. బేగంపేట డివిజన్ పాటిగడ్డ, ఎన్‌బీటీ నగర్, గౌతంనగర్, వడ్డెరబస్తీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పాదయాత్ర చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నెమలి ఆనంద్, వీజీలాల్, మితుజైన్ పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్‌లో ఇంటింటికి తిరుగుతూ కమలం గుర్తుకే ఓటు వేయాలంటూ మర్రి శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. డివిజన్ అధ్యక్షుడు కస్తూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ, నాయకులు దయానంద్, హృషీకేశ్, మూల రవీందర్, ఏచెన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు త్వరలో పరిష్కారం



మడ్‌ఫోర్ట్ పాత బస్తీలో పర్యటిస్తున్న జంపన ప్రతాప్

రసూల్‌పురా: మడ్‌ఫోర్ట్ పాత బస్తీలో ప్రజలు గత పదేళ్ళ నుంచి ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి త్వరలో నూతన పైపులైను పనులు ప్రారంభవుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ తెలిపారు. బుధవారం మూడవ వార్డు మడ్‌ఫోర్ట్ పాత బస్తీలో జంపన ప్రతాప్ స్థానికులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం సమస్యను సీఈఓకు వివరించగా నూతన డ్రైనేజీ పైపులైన్ పనులు చేపట్టేందుకు 18 లక్షల రూపాయలను మంజూరు చేశారని తెలిపారు. బస్తీ నుంచి కేజేఆర్ గార్డేన్ వైపు వెళ్లే మార్గంలో మూలమలుపులో మట్టి, ఇసుక రోడుపై చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు జంపనకు ఫిర్యాదు చేయడంతో వెంటనే బోర్డు చీఫ్ ఇంజనీర్ గోపాలకృష్ణదాస్‌కు ఫోన్ చేసి జేసీబీని పంపించి మట్టి. ఇసుకను తొలగించి స్థానికుల ఇబ్బందులు పరిష్కరించాలని కోరారు. స్థానికుల, జంపన అభ్యర్థన మేరకు చీఫ్ ఇంజనీర్ జేసీబీని పంపించి మట్టి ఇసుకను తొలగింప జేశారు. మహ్మద్ అజీజుద్దీన్, వినోద్‌కుమార్, ముజఫరుద్దీన్, మహేందర్, దఫేదార్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళాభివృద్ధి సాధ్యం

కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కోట నీలిమ

పద్మారావునగర్: మహిళాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ అన్నారు. బుధవారం రాత్రి బన్సీలాల్‌పేట్‌లో ఏర్పాటు చేసిన మహిళల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో మహిళలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని .. వారిని ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహాలక్ష్మీ స్కీమ్ కింద ప్రతి నెలా రూ. 2,500, రూ. 500 గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటివి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జె. దేవానంద్, శ్రీహరిలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధి కూడా..

సనత్‌నగర్: ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే సాధ్యమని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోట నీలిమ అన్నారు. బేగంపేట డివిజన్ పరిధిలోని ఎన్‌బీటీనగర్, వడ్డెరబస్తీలలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అధికారంలోకి వచ్చాక తప్పకుండా అమలుచేస్తోందన్నారు. బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో పెనుమార్పులు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.



బౌద్ధనగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

పద్మారావు గౌడ్ విస్తృత ప్రచారం

బౌద్ధనగర్: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని పథకాల అమలు సాఫీగా సాగుతున్నాయని, లబ్ధిదారుల ఎంపికలో కూడా పారదర్శకంగా వ్యవహరిస్తూ దళారీల ప్రమేయాన్ని పూర్తిగా నివారిస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో సికింద్రాబాద్‌ను అగ్ర స్థానంలో నిలుపుతున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, ప్రసన్నలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

దాడి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి



అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన వారితో పాటు దాడి వెనుకాల ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలనీ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలతో కలిసి హైదరాబాద్ జిల్లా అడిషినల్ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలనీ పోలీసులను కోరారు.

అడ్డగుట్ట బిడ్డకు అవకాశమివ్వండి

అడ్డగుట్ట: అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డగుట్ట బిడ్డ అయిన తనకు ఓటు వేసి గెలిపించాలని సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన ఆజాద్ చంద్రశేఖర్ నగర్, అడ్డగుట్ట, తుకారాంగేట్‌లలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ప్రజలు ఎన్నోసార్లు స్థానికేతరులకు అవకాశం ఇచ్చి గెలిపించారని, ఈసారి స్థానిక బిడ్డ అయిన తనకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నానన్నారు. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి బంపర్ మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు ఆదం సృజన్, గంట రాజుసాగర్, శాస్త్రి, రత్నకుమారి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే : తలసాని



బీఆర్‌ఎస్‌లోకి చేరిన బీజేపీ యువకులతో మంత్రి తలసాని

సనత్‌నగర్: రాష్ట్రంలో మళ్ళీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్ట ఎఫ్–లైన్‌కు చెందిన యువకులు బుధవారం బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీలోకి వలసల పరంపరం కొనసాగుతూనే ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సందీప్, నవీన్, లలిత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు అనుకూలం అంటూనే అన్యాయం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బన్సీలాల్‌పేట్ : ఎస్సీ వర్గీకరణకు అనుకూలం అంటూనే.. మాదిగలను ఆయా రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మండిపడ్డారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచా నెహ్రూనగర్‌లో విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అధికార, ప్రతిపక్షాలు కాలయాపన చేస్తూ.. మాదిగల జీవితాలతో ఆడుకుంటున్నాయని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తమ నిజాయితీ..చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ఎమ్మార్పీఎస్, మాదిగలు క్రియాశీలక పాత్ర నిర్వహించారని, అయితే అధికారంలోకి వచ్చిన కేసీఆర్ మాదిగలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తెలంగాణలో 10 మంది మాదిగ ఎమ్మెల్యేలుంటే.. ఏ ఒక్కరికీ కేసీఆర్ తన మంత్రి వర్గంలో చోటు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లల భవిష్యత్తు, మనుగడ కోసం మాదిగలు ఈ నెల 11న నిర్వహించే విశ్వరూప మహాసభకు పెద్దఎత్తున కదిలి రావాలని మంద కృష్ణ మాదిగ కోరారు.

ఆరోగ్యంగా ఉంటే ఏ పనైనా సాధ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వర్ధిని

బౌద్ధనగర్: అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని బౌద్ధనగర్‌లోని శ్రీ బాలాజీ హైస్కూలులో బుధవారం ఆయుర్వేదంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర్ధిని మాట్లాడుతూ శరీరం ఆరోగ్యంగా ఉంటేనే ఏ పనినైనా సాధించగలమని అన్నారు. అందుకు మన నిత్య జీవిత ఆలవాట్లు ఎంతో తోడ్పడుతాయన్నారు. పొద్దున్నే లేవగానే గోరు వెచ్చని నీరు తాగాలని, సూర్యకిరణాలు రాకముందే కాలకృత్యాలు తీర్చుకోవాలన్నారు. నడక, పరిగెత్తడం, సూర్య నమస్కారాలు, వ్యాయామం చేస్తే శరీరం, మనసు దృఢంగా మారి బుద్ధి బలం పెరుగుతుందని తెలిపారు. వేప, కానుగ పుల్లలతో పల్లు శుభ్రం చేసుకుంటే పంటి చిగుళ్లు దృఢంగా మారుతాయని సూచించారు. పారిజాతం ఆకులు నీటిలో మరిగించి తాగితే నడుము నొప్పి, మోకాళ్ల నొప్పులు దూరమౌతాయని వివరించారు. ఆయుర్వేదంతో చాలా ప్రయోజనాలు ఉన్నాయని, అపోహలు తొలగి అవగాహన కలగడం కోసం ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. స్కూల్ ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్, రిటైర్డ్ టీచర్ జయరాజ్ ఆర్య, సుధేష్‌తో పాటు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల బాగోగులు తెలిసిన పార్టీ బీఆర్‌ఎస్



ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలిని ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న లాస్యనందిత

రసూల్‌పురా: తెలంగాణ ప్రజల బాగోగులు తెలిసిన పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమేనని బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి లాస్యనందిత పేర్కొన్నారు. బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మూడవ వార్డు అంబేద్కర్ హట్స్, కంటోన్మెంట్ క్వార్టర్స్, మడ్‌ఫోర్ట్ అంబేద్కర్‌నగర్, సాయన్న డబుల్‌బెడ్‌రూం కాలనీ, శ్రీరాం నగర్, గాంధీనగర్, బేరర్స్‌లైన్ బస్తీల్లో కంటోన్మెంట్ ఇంచార్జి గజ్జెల నాగేష్‌తో కలసి లాస్యనందిత బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు సాంబ అశోక్, అనిల్, పరశురాం, చిన్న సూరి, నవీన్ పాల్గొన్నారు.

తలసాని విజయానికి కృషిచేద్దాం

సనత్‌నగర్: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి పనిచేసే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మరోసారి గెలిపించుకుందామని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజావసరాలను తెలుసుకుని తక్షణమే నెరవేర్చే నాయకుడిని గెలిపించుకోవడం ద్వారానే మరింత అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

అద్దెకు ఆర్టీసీ బస్సులు

- ఆర్టీసీ డీఎం ఎన్. లక్ష్మీధర్మా

బన్సీలాల్‌పేట్: పెండ్లిళ్లు ఇతరత్రా శుభకార్యాల కోసం ఆర్టీసీ బస్సులను బస్ ఆన్ కాంట్రాక్ట్ పేరిట అద్దెకు ఇస్తున్నట్లు సికింద్రాబాద్ రాణిగంజ్ డిపో మేనేజర్ ఎన్. లక్ష్మీధర్మా తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. తక్కువ ధరలు, సురక్షితమైన ప్రయాణం కోసం ప్రజలు ఆర్టీసీ బస్సులను ఉపయోగించుకోవాలని కోరారు. వచ్చే మూడు నెలల్లో అనేక పెళ్లిళ్లు ఉన్నాయని ...అయితే అందుకు ఆర్టీసీ బస్సులను ఉపయోగించుకోవాలన్నారు. ప్రైవేట్ బస్సులతో పోల్చుకుంటే చార్జీలు కూడా ఎంతో తక్కువగా ఉన్నాయని చెప్పారు. వివరాల కోసం 99593 22198, 73828 20826, 73828 15116 కాల్ చేయాలని సూచించారు.

శబరియాత్ర

శబరియాత్రకు కూడా ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆర్టీసీ సుమారు 700 పైగా నూతన సూపర్‌లగ్జరీ బస్సులను కొనుగోలు చేసిందని డీఎం లక్ష్మీధర్మా చెప్పారు. అయ్యప్పస్వాములు సుదూర ప్రయాణాన్ని సురక్షితంగా పొయి రావడానికి ఆర్టీసీ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. వచ్చే దారుల్లో వివిధ పుణ్యక్షేత్రాలను కూడా దర్శించుకోడానికి వీలు కల్పిస్తామన్నారు. గురుస్వామి బస్సు బుక్ చేస్తే వారికి ఉచితంగా సీటు ఇవ్వడంతో పాటు ఒక్క బస్సుకన్న ఎక్కువ బస్సులను బుక్ చేస్తే ప్రతి రోజు రూ. 300 చొప్పున కమీషన్ ఇవ్వనున్నట్లు వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అమీర్‌పేట శీష్‌మహల్ థియేటర్ ప్రాంతం, జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్, దివ్యశక్తి లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ప్రొ.శ్రీరామ్ వెంకటేష్

ఓయూలో మైనింగ్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇండియన్ మైనింగ్ డే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. బుధ వారం మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరి గిన కార్యాక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఎగుర వేసి మాట్లాడారు. మాజీ సీఎండీ సురేందర్ మో హన్, వెంకటరామయ్య, రంగనాధీశ్వర్, మిట్టపల్లి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు బాధితుడికి అప్పగింత



బ్యాగులోని నగదును లోకేష్‌కు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు

లాలాపేట: ఓ వ్యక్తి బైక్‌పై వెళుతూ బ్యాగును పోగొట్టుకోగా స్పందించిన పోలీసులు దానిని వెతికి బాధితుడికి అప్పగించారు. ఈ సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన మేరకు.. నాగోల్ ప్రాంతానికి చెందిన లోకేష్ బుధవారం మధ్యాహ్నం బైక్‌పై వెళుతుండగా మెట్టుగూడ–హబ్సిగూడ మార్గంలో బ్యాగు పోగొట్టుకున్నాడు. ఆ బ్యాగులో రూ.38,000 ఉన్నాయి. వెంటనే అతను పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కానిస్టేబల్ శ్రీనివాస్ సకాలంలో స్పందించి సీసీ కెమెరాల ఆధారంగా హబ్సిగూడ చౌరస్తాలో బ్యాగు రోడ్డుపై పడి ఉండగా మదనపల్లికి చెందిన ఓ వ్యక్తి ఆ బ్యాగును తీసుకుని వెళ్లినట్లు గుర్తించారు. ఆ వ్యక్తి వాహనం నెంబర్ ఆధారంగా ఆ వ్యక్తికి ఫోన్‌చేయగా ఆ బ్యాగును తీసుకుని వచ్చి పోలీసులకు అందజేశారు. ఓయూ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ ఆ బ్యాగును, అందులోని నగదును లోకేష్‌కు అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ద్విచక్ర వాహనాల పార్కింగ్ వద్ద పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసికున్నారు. ఎస్ఐ వేణుగోపాల్ తెలిపిన మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడివుందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడికి సుమారు 60 ఏళ్ల వయసు ఉటుందని, తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని అనారోగ్యంతో మృతి చెందిన ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. సంబంధీకులు ఉంటే గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో లేదా 7780219468 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎస్‌ఆర్‌నగర్‌లో పోలీసుల తనిఖీ

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం వాహన తనిఖీలు చేశారు. వాహనాలకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకుండా రోడ్లపై తిరుగుతున్న 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రాత్రి జరిపిన తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.8 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాంప్రసాదరావు తెలిపారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అందులో భాగంగా లయన్ విజయ్‌కుమార్ చేస్తున్న సేవలు అందరికి ఆదర్శనీయమని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఆరిగపూడి పూర్ణచందర్‌రావు ఫౌండేషన్, విమల సాహితి సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కవులు సాహిత్యానికి సంబంధించిన కవితలను చదివి వినిపించారు. అనంతరం జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... ఎన్ని కోట్లు సంపాదించిన, ఎన్ని పదవులు నిర్వహించిన చివరకు ఏది తమ వెంట రాదని, సమాజ సేవయే చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. లయన్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ... సమాజ హితం కోసం తమ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కళా రత్న డాక్టర్ బిక్కి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి డాక్టర్ విద్యాదర్‌రావు, రచయిత పాతూరి మల్లేష్, స్వామి, అపర్ణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

అభివృద్ధే బీఆర్‌ఎస్‌ను తిరిగి గెలిపిస్తుంది



మంత్రికి మంగళహరతులతో స్వాగతం పలికిన మహిళలు

అమీర్‌పేట: తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తిరిగి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం నియోజవర్గం పరిధిలోని బాపూనగర్, ముస్లీం బస్తీలో, ఎస్ఆర్‌టీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో ఆయనకు స్వాగతం పలికారు. నామన శేషుకుమారి, హనుమంత్‌రావు, సంతోష్,హరిసింగ్, లలితాచౌహన్, సుమిత్ సింగ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కేజేఆర్ గుడ్‌బై

మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కేజేఆర్, చిత్రంలో మంత్రి మల్లారెడ్డి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ కాంగ్రెస్‌లో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. నియోజకవర్గంలో పార్టీ సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ సేవాదళ్ జాతీయ కోశాధికారి, మాజీ ఎమ్మెల్సీ, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు కనుకుల జనార్ధన్ రెడ్డి (కేజేఆర్) కాంగ్రెస్ పార్టీని వీడారు. రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి బావ అయిన కేజేఆర్ మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి ఆయన వెంట ఉన్నారు. అనంతరం కేజేఆర్ మడ్‌ఫోర్ట్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ సేవాదళ్ జాతీయ కోశాధికారిగా కొనసాగుతున్న తనకు రాష్ట్ర అధినాయకత్వం తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు.

మా బావ సార్...

కేజేఆర్ పార్టీలో చేరిక సందర్భంగా ఆయన బావమరిది మల్లారెడ్డి తనదైన శైలిలో ఆయనను కేటీఆర్‌కు పరిచయం చేశారు. మా పెద్ద బావ సార్ అంటూ కేటీఆర్‌కు చెప్పారు. కంటోన్మెంట్‌లోని పేరెన్నిక కలిగిన కేజేఆర్ గార్డెన్స్ ఆయనదేనంటూ చెప్పుకొచ్చారు.